

## 'ప్రజ్ఞాన ప్రకాశిక' పుస్తకావిష్కరణ

**ప్రజాశక్తి - కడప అర్బన్**


రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండూరు జనార్దన రాజు, వైఎస్ఆర్ జిల్లా రచయితల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో కడప సి.పి. బ్రౌన్ పరిశోధన కేంద్రంలో శనివారం కె.వి. రమణారెడ్డి రచించిన 'ప్రజ్ఞాన ప్రకాశిక' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. వైవియూ వీసీ చింతా సుధాకర్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రమణారెడ్డి మొదట 'సాక్షాత్కారం' తర్వాత 'గీర్వాణీతిలకం గీతాంజలి' రచించారని, ఇప్పుడాయన రచించిన 'ప్రజ్ఞాన ప్రకాశిక' జ్ఞాన పరిణతికి నిదర్శనంగా చెప్పవచ్చన్నారు. కార్యక్రమంలో సభాధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి, పసుపులేటి శంకర్, ఎ. రామాంజుల రెడ్డి, కల్లూరు బాల యల్లారెడ్డి, ఫైర్ వెల్లాల వెంకటేశ్వ రాచారి, భూపతి రాయల్, ఆధ్యాత్మిక చింతనాపరులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు.

# డయేరియాపై అప్రమత్తంగా ఉండండి

**- జెసి గణేష్ కుమార్**

**ప్రజాశక్తి - కడప అర్బన్**

డయేరియా నియంత్రణపై అప్రమత్తంగా ఉండాలని, ప్రజలను చైతన్యం చేయాలని అధికారులను జాయింట్ కలెక్టర్ గణేష్ కుమార్ ఆదేశించారు. శనివారం జాయింట్ కలెక్టర్ ఛాంబర్‌లో అతిసార కేసుల వ్యాప్తి, నియంత్రణ (స్టాప్ డయేరియా క్యాంపెన్) పై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో జాయింట్ కలెక్టర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ డయేరియా ప్రభావం, ముందస్తు జాగ్రత్తలు, తీసుకోవాల్సిన చర్యలపై జులై 1 నుంచి ఆగస్టు 31 వరకు స్టాప్ డయేరియా క్యాంపెయిన్ ప్రోగ్రాంను జిల్లాలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రిమ్స్ హాస్పిటల్, డిస్ట్రిక్ట్ హాస్పిటల్, అంగన్వాడీ సెంటర్లలో ఒఆర్ఎస్, జింక్ కార్నర్స్ ఏర్పాటు చేసి, ఒఆర్ఎస్ ప్రదర్శన చేసి చూపించాలని సూచించారు. ఈనెల 31వరకు ప్రిపరేటరీ అంశంలో భాగంగా అన్ని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాలలోని ఎంఎల్‌హెచ్‌పిలకు, ఆరోగ్య కార్యకర్తలకు, అంగన్వాడీ కార్యకర్తలకు, ఆశాలకు, ఒఆర్ఎస్, జింక్ టాబ్లెట్ల గురించి అవగాహన కల్పించాలని. జిల్లాలో ఐదు సంవత్సరాలలోపు పిల్లలకు డయేరియా సోకకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తాగునీటి పైప్‌లైన్ లీకేజీ కాకుండా ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు సరిచూసుకోవాలన్నారు. తాగునీటి ద్వారా సక్రమించే డయేరియా రాకుండా అధికారులు ముందస్తు నియంత్రణ చర్యలు చేపట్టాలన్నారు. అందులో భాగంగా నీటి వనరులు, బావులను క్లోరినేషన్ చేయడం, కలుషిత నీరు సరఫరా కాకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి చర్యలు చేపట్టాలన్నారు. ఇదివరకే జిల్లాలో డయేరియా గుర్తించిన ప్రాంతాలపై వైద్య ఆరోగ్య, నీటి సరఫరా, పంచాయతీ శాఖ,మున్సిపాలిటీ శాఖలు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. వైద్య సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయేరియా మందులు, ఒఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు పూర్తి స్థాయిలో అందుబాటులో సిద్ధంగా ఉంచుకోవాలని ఆదేశించారు. అలాగే ప్రజలు రోగాల బారిన పడితే తక్షణమే వైద్య సేవలు అందేలా వైద్యశాఖాధికారులు చర్యలు చేపట్టాలన్నారు. తాగునీటి, వైద్య సేవలపై అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నీటిని కాచి వడపోసి తాగేలా అవగాహన కల్పించాలని తెలిపారు. మున్సిపాలిటీల పరిధిలో తాగునీటి ఓవర్ హెడ్ ట్యాంకుల నిర్వహణ పక్కగా ఉండాలని మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. వివిధచోట్లలో చిన్నపిల్లలు చనిపోకుండా చూడడమే మన లక్ష్యమని ప్రతి ఒక్క డిపార్ట్‌మెంట్ సకాలంలో స్పందించి సమస్యను వెంటనే పరిష్కరించాలని సూచించారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. నాగరాజు మాట్లాడుతూ డయేరియాకి సంబంధించి ఒఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు ఫుల్లుగా సిద్ధంగా ఉన్నాయని జాయింట్ కలెక్టర్‌కు వివరించారు. ఒఆర్ఎస్ ప్యాకెట్లు, జింక్ మాత్రలు అన్ని విలేజ్ హెల్త్ క్లినిక్, పిహెచ్‌సిలు, అంగన్వాడీ సెంటర్లు, ప్రతి ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నాగరాజు, డిఎఒ ప్రభాకర్ రెడ్డి, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి వీరయ్య, జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి శ్రీలక్ష్మి, జిల్లా విద్యాధికారి అనురాధ, డాక్టర్, డిఐఒ ఉమా మహేశ్వర కుమార్, డిఎల్ఓ ఐ ఎ రవిబాబు, డిసిహెచ్ ఎస్ హిమ దేవి, డిపిఎంఒ డాక్టర్ నాగ శశిభూషణరెడ్డి, జిజిహెచ్ డాక్టర్ ఎం.సుర్వేశ్వర్ రెడ్డి, మున్సిపాలిటీ కమిషనర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.




డయేరియా వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్న వైద్య సిబ్బంది

# ఆత్మవిశ్వాసంతో ముందుకెళదాం

- నాయకులు, కార్యకర్తలతో వైఎస్.జగన్
- అడుగడుగునా నీరాజనం
- కాన్వాయ్‌కి తప్పిన ప్రమాదం
- పులివెందుల్లో తోపులాట..పగిలిన కిటికీ అద్దాలు

**ప్రజాశక్తి-పులివెందుల టౌన్/కడప/వేంపల్లె**

ప్రతిపక్షం మనకు కొత్త కాదని ఎవరు అధైర్య పడకూడదని ఆత్మవిశ్వాసంతో ముందుకు వెళ్దామని ఏ సమస్య వచ్చిన మీ వెంటే నడుస్తానని నాయకులకు, కార్యకర్తలకు మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. వైఎస్ఆర్ జిల్లాలో మూడు రోజుల పర్యటనలో భాగంగా శనివారం విజయవాడ నుంచి ప్రత్యేక విమానంలో కడపకు చేరుకున్నారు. కడప నుంచి రోడ్డు మార్గంలో పులివెందులకు చేరుకున్నారు. రోడ్డు మార్గంలో వెళుతున్న జగన్‌కు వైసిపి నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. తనను ఆప్యాయంగా పలకరిస్తున్న ప్రజల కోసం తన వాహనాన్ని ఆపుతూ జగన్ వెళ్లారు. ప్రతి ఒక్కరిని ఆప్యాయంగా పలకరించి అభివాదం చేశారు. దాడిపొడవునా అందరినీ నవ్వుతూ పలకరిస్తూ వెళ్లారు. కొందరైతే బాణాసంచా కాల్చుతూ స్వాగతం పలికారు. జగనన్నా నీవెంటే అంటూ జనాలు పెద్ద ఎత్తున కేకలు వేశారు. పులివెందుల క్యాంపు కార్యాలయానికి చేరుకుని జగన్ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. జగన్‌ను కలిసిన వారిలో కడప పార్లమెంట్ సభ్యుడు వైఎస్ అవినాష్‌రెడ్డి, రాజంపేట ఎమ్మెల్యే అమర్నాథ్‌రెడ్డి, మాజీ ఉప ముఖ్యమంత్రి అంజద్‌బాష, కడప మేయర్ సురేష్ బాబు, ఎమ్మెల్సీ రమేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, కోరముట్ల శ్రీనివాసులు, మాజీ డిప్యూటీ శాసనమండలి చైర్మన్ సతీష్ కుమార్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, వైఎస్ అభిషేక్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ చిన్నప్ప నియోజకవర్గంలోని వివిధ మండలాల వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఉన్నారు.

**కాన్వాయ్‌కి తప్పిన ప్రమాదం**

పులివెందుల పర్యటనలో భాగంగా శనివారం కడప విమానాశ్రయానికి చేరుకున్న జగన్ మోహన్‌రెడ్డి అక్కడ నుండి రోడ్డు మార్గాన పులివెందులకు వెళుతుండగా రామరాజుపల్లి సర్కిల్ వద్ద చిన్న అపశృతి చోటుచేసుకుంది. జగన్ అభిమానులు రోడ్డుకు అడ్డంగా ఉండడంతో కాన్వాయ్‌లోని ఓ వాహనం సడన్ బ్రేక్ వేయడంతో వెనకాలే వస్తున్న ఇన్నోవా కారును ఫైర్ ఇంజన్ ఢీకొంది. కారు ముందు భాగం నుజ్జు అయింది. కారులో ప్రయాణిస్తున్న వారికి ఎవరికి గాయాలు కాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.



కడప ఎయిర్‌పోర్టులో ప్రజలకు అభివాదం తెలియజేస్తున్న వైఎస్ జగన్

**పులివెందుల్లో తోపులాట..పగిలిన కిటికీ అద్దాలు**

జగన్‌ను కలిసేందుకు వైసిపిశ్రేణులు తోసుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. భద్రతా సిబ్బంది జగన్ కార్యాలయంలో కాకుండా తన నివాసంలోనికి వెళ్తారని అక్కడ బందోబస్తుని ఏర్పాటు చేశారు అనుకోకుండా వైసిపి కార్యాలయాలోకి జగన్ రావడంతో అప్పటికే అక్కడ భారీగా తరలివచ్చిన వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు జై జగన్, జై సిఎం అంటూ ఆయన కలిసేందుకు ముకుముడిగా వాహనం వైపు రావడంతో పోలీసులు చేసేదేమీ లేక చేతులు వెత్తారు. ఒకరికొకరు తోసుకుంటూ కార్యాలయంలోకి పోయేంతవరకు ఉద్రిక్తత వాతావరణం ఏర్పడింది ఈ తోపులాటలో కొంతమంది కిటికీల మీద పడడంతో అద్దాలు పగిలాయి.

**కౌంటింగ్ తర్వాత జరిగిన పరిణామాలపై చర్చ**

నియోజకవర్గంలో కౌంటింగ్ తర్వాత అధికారం కోల్పోవడంతో గ్రామాలలో జరిగిన పరిణామాలపై వైసిపి శ్రేణులతో వైఎస్.జగన్మోహన్‌రెడ్డి చర్చించారు. మెజార్టీ తగ్గడానికి గల కారణాలను వైసీపీ శ్రేణులు జగన్‌కు వివరించినట్టు తెలుస్తుంది. ధైర్యంగా ఉండండాలని, ఐదేళ్లు తొందరగా వస్తాయాని జగన్ కార్యకర్తలు, నాయకులతో పేర్కొన్నారు.

**అడుగడుగునా జగన్‌కు నీరాజనం**

మాజీ ముఖ్యమంత్రి పులివెందుల, ఎమ్మెల్యే వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అడుగడుగునా నీరాజనం పలికారు. శనివారం విజయవాడ నుంచి పులివెందులకు విచ్చేశారు. కడప ఎయిర్‌పోర్టు నుంచి రోడ్డు మార్గం ద్వారా వేంపల్లె మీదుగా పులివెందులకు బయలుదేరారు. వేంపల్లె బైపాస్ రోడ్డులోని దారి పోడవునా జనాలు నిల్చుని ఆయనకు స్వాగతం పలికారు. వారిని జగన్ ఆప్యాయంగా పలకరిస్తూ వెళ్లారు. స్థానిక హనుమాన్ జంక్షన్, రాజీవ్ నగర్ కాలనీ వద్ద వైసిపి నాయకులు జగన్‌కు నీరాజనం పలికారు. 'అన్నా..నీవెంటే మేము' అంటూ పెద్ద ఎత్తున కేకలు వేశారు. జగన్‌ను కలిసిన వారిలో అయ్యవారిపల్లి రామగంగిరెడ్డి, ప్రసాద్ రెడ్డి, శేషు, మటన్ బాబా, చంద్ర, రాజ్ కుమార్, హబీబ్, బికారి, ఆది, కటిక చంద్ర శేఖర్, మణిగోపాల్ రెడ్డి, కొత్తూరు రెడ్డయ్య, పాస్టర్ రవికుమార్ ఉన్నారు.



పులివెందుల క్యాంప్ ఆఫీసులో కార్యకర్తలు, అభిమానుల తోపులాట నడుమ జగన్ అభివాదం

## ప్రయివేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులు అరికట్టాలి

**ప్రజాశక్తి - బద్వేలు**

బద్వేల్ పట్టణంలోని ప్రయివేట్ విద్యా సంస్థల్లో అధిక ఫీజులను అరికట్టాలని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా అధ్యక్షులు ఎద్దు రాహుల్, భారత ప్రజా తంత్ర యువజన సమాఖ్య (డివైఎఫ్ఐ) జిల్లా అధ్యక్షులు ముడియం చిన్నిలు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక సుందరయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లా డుతూ బద్వేల్ పట్టణంలో ప్రయివేట్ విద్యాసంస్థల్లో ఎవరికి వారు విచ్చలవిడిగా అధిక ఫీజులు విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు. టెక్స్‌బుక్స్, యూనిఫాం, ఒలంపియాడ్, సైనిక్, గురుకలాలు కోచింగ్‌లు అని పెట్టి ఇష్టం వచ్చినట్లు వేలకు వేలు వసూలు చేస్తున్నారని చెప్పారు. వారిని అదుపు చేయడంలో విద్యాశాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని వాపోయారు. ఒకపక్క జిల్లా విద్యాశాఖ అధికారులు అధిక ఫీజులు వసూలు చేస్తే వారిపైన కఠిన చర్యలు తీసుకుంటామని పేపర్ ప్రకటనలకు పరిమి తమయ్యారన్నారు. ఒకపక్క స్కూల్లో యూనిఫాం, పుస్తకాలు విక్రయించరాదని చెప్పినప్పటికీ అమ్ముతున్నారని వారు తెలిపారు. ప్రయివేట్ విద్యాసంస్థల్లో మండల విద్య శాఖ అధికారులు తనిఖీలు చేయకుండా కొంతమంది విద్యాశాఖ అధికారులు ప్రయివేట్ స్కూళ్లకు అమ్ముడుపోయారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా అధికారులు చొరవ తీసుకుని ప్రయివేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు అరికట్టాలని, ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా పాల్పడుతున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో అన్ని విద్యార్థి యువజన సంఘాలను కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన పోరాట చేపడుతామని వారు హెచ్చరించారు.



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

## మెస్, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లించాలని వినతి

**ప్రజాశక్తి- కడప అర్బన్**

పెండింగ్‌లో ఉన్న మెస్, కాస్మోటిక్ ఛార్జీలు చెల్లించాలని పిడిఎస్‌యు రాష్ట్ర ఉపాధ్యక్షులు అంకన్న కోరారు. శనివారం సాంఘిక సంక్షేమ శాఖ డిడి సరస్వతికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వసతి గృహాల్లో చదువుతున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించే దిశగా ప్రభుత్వ అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లాలని కోరారు. తొమ్మిది నెలల నుంచి పెండింగ్‌లో ఉన్న కాస్మోటిక్, మెస్ ఛార్జీలు చెల్లించకపోవడంతో విద్యార్థులు ప్రధానంగా వసతి గృహ అధికారుల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. స్థానికంగా వసతి గృహ అధికారులు ఉండేటట్లు చర్యలు తీసుకోవాలని కోరారు. వసతి గృహ అధికారులు ఇన్‌ఛార్జి వసతి గృహ అధికారులుగా తమ సమీప వసతి గృహాలకు నియమించడం లేదని తెలిపారు. ఖాజీపేట, బద్వేల్, సిద్ధవటం, బ్రహ్మంగారిమఠం, ఒంటిమిట్ట ఇష్టానుసారంగా వసతి గృహాల అధికారులుగా నియమించారన్నారు. దీని వల్ల విద్యార్థుల పర్యవేక్షణ కరవైందన్నారు. అద్దె భవనాలల్లో కొనసాగుతున్న వసతి గృహాలు నూతన భవనాలు ఏర్పాటు చేసే దానికి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు స్వరూప్ తేజ, నగర కార్యదర్శి గణేష్ పాల్గొన్నారు.

## ఉర్దూ మాధ్యమం పాఠ్యపుస్తకాలు ఇవ్వాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

పాఠశాలలు పునః ప్రారంభమై పది రోజులు అయినప్పటికీ ప్రభుత్వ పాఠశాలల్లో ఉర్దూ మాధ్యమం పాఠ్యపుస్తకాలు (6వ తరగతి మినహా) విద్యార్థులకు అందలేదని వెంటనే సరఫరా చేయాలని ఐటా రాష్ట్ర అధ్యక్షులు ఎస్.అబ్దుల్ రజాక్, జిల్లా అధ్యక్షులు ఎస్.నజీర్ బాష ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. గత సంవత్సరం 9వ తరగతి పాఠ్యపుస్తకాలు, ఈ సంవత్సరం పదో తరగతి పాఠ్యపుస్తకాలు మారినప్పటికీ, ప్రథమ భాష ఉర్దూకు సంబంధించిన పాత ఉర్దూ పాఠ్యపుస్తకాన్ని సరఫరా చేస్తున్నారని తెలిపారు. మిగిలిన అన్ని సబ్జెక్టుల పాఠ్యపుస్తకాలను కొత్తగా తయారు చేశారని పేర్కొన్నారు. ప్రథమ భాష ఉర్దూ పాఠ్య పుస్తకాల్ని తయారు చేయకుండా ఎందుకు పక్కన పెట్టినారో అర్థం కావడం లేదని తెలిపారు. ఈ విషయంలో విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బాబు జోక్యం చేసుకుని ప్రథమ భాష ఉర్దూ పాఠ్యపుస్తకాల్ని కొత్తగా తయారు చేయించాలని పేర్కొన్నారు.

## పర్యావరణ కార్యదర్శులకు న్యాయం చేయాలి

**ప్రజాశక్తి - కడప :** రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న వార్డు శానిటేషన్, పర్యావరణ కార్యదర్శులకు న్యాయం చేయాలని ఆంధ్రప్రదేశ్ వార్డు శానిటేషన్, ఎన్విరాన్మెంట్ కార్యదర్శుల అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇరా మియ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గత ప్రభుత్వంలో సచివాలయ ఉద్యోగులుగా చేరి, వార్డు శానిటేషన్, పర్యావరణ కార్యదర్శులుగా నియమితులై కాలువలు, చెత్త కుప్పలు తొలగిస్తున్నామని పేర్కొన్నారు. 423 జీవో ద్వారా తమకు అన్యాయం జరిగిందని, ప్రస్తుత ప్రభుత్వం వెంటనే జీవోను రద్దుచేసి, రాష్ట్రవ్యాప్తంగా పనిచేస్తున్న వార్డు శానిటేషన్, పర్యావరణ కార్యదర్శులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామ వార్డు సచివాలయ అందరిని జూనియర్ అసిస్టెంట్ పే స్కేల్ వర్తింపజేయాలని పేర్కొన్నారు. ఐదేళ్ల నుంచి రాష్ట్ర వ్యాప్తంగా వార్డు శానిటేషన్, పర్యావరణ కార్యదర్శులు కార్పొరేషన్ పరిధిలో పని చేస్తూ చాలా రకాలుగా వేధింపులకు గురయ్యారని, ఇదే కోవకు సంబంధించి ఒకరు ఉద్యోగాన్ని కోల్పోయారని, మరొకరు ఇంకా రెగ్యులేషన్ కాకుండా బాధపడుతున్నారని, వారికి న్యాయం చేయాలని కోరారు.

## రైతులకు పెట్టుబడి సాయం జమ చేయాలి

**- ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి**

**ప్రజాశక్తి కడప అర్బన్**

ఎన్నికల ముందు ఇచ్చిన సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు వారి ఖాతాలో జమ చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపి రైతు సంఘం కడప జిల్లా కార్యదర్శి బి దస్తగిరి రెడ్డి కోరారు. శనివారం రైతు సంఘం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టిడిపి కూటమి మెజార్టీతో రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిందని తెలిపారు. గత ప్రభుత్వంపై ప్రజల్లో ఉన్న వ్యతిరేకతకు తోడు సూపర్ సిక్స్ పేరుతో కూటమి ఇచ్చిన హామీలను కూడా పెద్ద ఎత్తున ప్రభావం చూపాయని పేర్కొన్నారు. గత ఖరీఫ్, రబీ సీజన్లలో వర్షాభావంతో ఒకవైపు కరువు అయితే, మరోవైపు డిసెంబర్‌లో వచ్చిన తుపాన్‌తో పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని చెప్పారు. వ్యవసాయ సీజన్ ప్రారంభమైందని ఈ ఖరీఫ్‌లో వ్యవసాయ పెట్టుబడుల కోసం రైతాంగం తీవ్రంగా ఇబ్బందులు పడుతుందన్నారు. సున్న, పావలా వడ్డీ రాయితీలు ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో వడ్డీ, అసలు కట్టాలని రైతులపై బ్యాంకులో ఒత్తిడి చేసి వసూలు చేస్తున్నాయని పేర్కొన్నారు. వడ్డీ రాయితీ విడుదల చేసి రైతుల ఖాతాలో వేయాలని, ఎన్నికల ముందు టిడిపి కూటమి ప్రకటించిన పెట్టుబడి సాయం కింద ఇస్తామన్న రూ.20 వేలు వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని కోరారు. వీటిపైన ఈనెల 24న కలెక్టర్‌కి వినతి పత్రం ఇస్తున్నామని తెలిపారు. సమావేశంలో ఎపి రైతు సంఘం కడప జిల్లా ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి పాల్గొన్నారు.




మాట్లాడుతున్న దస్తగిరిరెడ్డి

## దాడులకు పాల్పడ్డం సరికాదు : వైసిపి

**ప్రజాశక్తి - కడప**

రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే దాడులకు పాల్పడడం సరికాదని కడప జిల్లా వైసిపి అధ్యక్షులు కె. సురేష్ బాబు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి అన్నారు. పులివెందుల పర్యటనలో భాగంగా శనివారం గన్నవరం నుండి కడప విమానాశ్రయానికి మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేరుకున్నారు. ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కడప విమానాశ్రయం వెలుపల ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సురేష్ బాబు, అమర్నాథ్ రెడ్డి మాట్లాడారు. వైసిపి రాష్ట్ర కార్యాలయాన్ని, సచివాలయాన్ని ధ్వంసం చేయడం అ ప్రజాస్వామికమన్నారు. ఎన్నికలు జరిగి 20 రోజుల్లో దాడులు, వైఎస్ఆర్ విగ్రహాలు ధ్వంసం చేశారు అన్నారు. గతంలో తమ ప్రభుత్వం ఉన్న సమయంలో విధ్వంసాలకు పాల్పడలేదన్నారు. అరాచక పాలన సరికాదన్నారు. రాష్ట్రాన్ని మరో బీహార్ల మార్చేస్తున్నారని వాపోయారు. వైసిపి కార్యకర్తలు, నేతలపై దాడులు చేయడం సిగ్గుచేటు అన్నారు. ఈ ఘటనలపై గవర్నర్, రాష్ట్రపతికి ఫిర్యాదు చేస్తామని చెప్పారు.



మీడియాతో మాట్లాడుతున్న సురేష్‌బాబు

## రేపు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

**ప్రజాశక్తి- పోరుమామిళ్ల :** మండలంలోని తహశీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు మండల ప్రత్యేక అధికారి డాక్టర్ చంద్ర శేఖర్, ఎంపిడిఒ వర ప్రసాదరావు ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. తమతో పాటు తహశీల్దార్ శిరీషా, ఇతర మండల స్థాయి అధికారులు పాల్గొంటారని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను తెలియజేస్తే పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామన్నారు. ప్రజలు కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని కోరారు. **చెన్నూరు :** కలెక్టర్ ఆదేశాల మేరకు ప్రతి సోమవారమూ అన్ని ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ ద్వారా ప్రజల నుంచి వ్యాధులు స్వీకరించి ఫిర్యాదు దారులకు నిర్ణీత సమయంలో సమస్యలను పరిష్కరిస్తామని తహశీల్దార్ ప్రకాష బాబు పేర్కొన్నారు. శనివారం ఆయన స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 24న ఉదయం 9 గంటల నుంచి తహశీల్దార్ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (గ్రీవెన్స్ సెల్) ద్వారా ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు. మండల ప్రజలు ఏవైనా సమస్యలుంటే తహశీల్దార్ కార్యాలయానికి వచ్చి తమ ఫిర్యాదులు అర్జీ రూపంలో తెలియజేసి సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. ప్రతి సోమవారమూ కార్యాలయంలో అన్ని శాఖల అధికారులు హాజరవుతారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## అధిక ఫీజు వసూలు చేస్తే చర్యలు : డిఇఒ

**కడప అర్బన్ :** ప్రయివేట్, కార్పొరేట్ పాఠశాలల్లో అధిక ఫీజులు వసూలు చేస్తున్నట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా విద్యాశాఖ అధికారి అనురాధ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫీజులకు సంబంధించిన వివరాలను పాఠశాల నోటీసు బోర్డులో ఉంచాలని తెలిపారు. పాఠశాలల్లో పుస్తకాలు అమ్మకూడదని పేర్కొన్నారు. వీటిపై విద్యార్థుల తల్లిదండ్రులు ఫిర్యాదు చేస్తే విచారించి చర్యలు తీసుకుంటామన్నారు.

## ఘనంగా కెఎస్ఆర్ఎం కళాశాల 7వ స్నాతకోత్సవం

**ప్రజాశక్తి - కడప అర్బన్**

కెఎస్‌అర్ఎం ఇంజినీరింగ్ కళాశాల (అటానమస్)లో బి.టెక్ 2020 - 2024 బ్యాచ్ వివిధ బ్రాంచీలలో విద్యను పూర్తి చేసిన విద్యార్థులకు 7వ స్నాతకోత్సవాన్ని కళాశాల కెఒఆర్ఎం ఆడిటోరియంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెఎన్‌టియు అనంతపురం విసి ప్రొఫెసర్ శ్రీనివాసరావు ద్వారా పట్టభద్రులైన విద్యార్థులకు బ్రాంచ్‌లు వారీగా పట్టాలను, ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా విసి మాట్లాడుతూ మీ జీవితంలో తదుపరి అధ్యాయాన్ని ప్రారంభించడానికి, పట్టభద్రత అనేది అపరిమిత అవకాశాలకు, అసీమిత సాధ్యతలకు ప్రారంభం అని పేర్కొన్నారు. కళాశాల మేనేజింగ్ డైరక్టర్ డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి మాట్లాడుతూ జీవిత ప్రయాణానికి రేపటి ప్రపంచానికి ఆవిష్కరణలకు రాయబారులుగా, నాయకులుగా ఎదగాలని కోరారు. యూనివర్సిటీ నామిని ప్రొఫెసర్ వి.దుర్గాప్రసాద్, కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ, ట్రేజరర్ కందుల రాజేశ్వరమ్మ, ప్రిన్సిపల్ డాక్టర్.వి. ఎస్. ఎస్.మూర్తి, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ టి.ఎన్. ప్రసాద్, అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్ పి. ప్రేమ్ కుమార్, వివిధ విభాగాధిపతులు, డీన్‌లు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ పి.శ్రీనివాస్, సిబ్బంది, కళాశాల బోధన, భధనేతర సిబ్బంది, విద్యార్థినీ విద్యార్థులు, తల్లితండ్రులు పాల్గొన్నారు.




స్నాతకోత్సవంలో జెఎన్‌టియు అనంతపురం విసి శ్రీనివాసరావు

## పుల్లారెడ్డి ట్రస్ట్ సేవలు అభినందనీయం

**ప్రజాశక్తి-కలసపాడు :** పుల్లారెడ్డి ట్రస్ట్ సేవలు మరువలేనివని సర్పంచి ఎన్. వెంకటయ్య, ఎస్‌టియు రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పి.రమణారెడ్డి అన్నారు. శనివారం ఇ.రామాపురంలోని జడ్‌పి హైస్కూల్‌లో 2024 పదవ తరగతి పరీక్షలలో టాపర్లుగా నిలిచిన విద్యార్థినులకు డి.తంబళ్లపల్లె గ్రామానికి చెందిన నాలిపుల్లారెడ్డి యాదవ్ ట్రస్టు ఆధ్వర్యంలో నగదు, ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమానికి ప్రధానోపాధ్యాయుడు ఎస్.కమాల్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథులుగా పాల్గొన్న రమణారెడ్డి, వెంకటయ్య మాట్లా డుతూ పేద, బడుగు, బలహీన మధ్యతరగతి వర్గాల పిల్లలు విద్యాపరంగా అభివృద్ధి చెందినపుడే రాష్ట్రం,దేశం అభివృద్ధి చెందుతుందని భావించి వ్యవస్థా పకులు నాలి క్రిష్ణారెడ్డి యాదవ్, నాలి రామక్రిష్ణయాదవ్ ట్రస్టు ఏర్పాటు చేయడం అభినందనీయులని పేర్కొన్నారు. ట్రస్టు వ్యవస్థా పకులు మాట్లాడుతూ తాము పుట్టిపెరిగిన ప్రాంతానికి తమవంతు సాయం అందించాలనే ఆలోచనతో ఇలాంటి కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. భవిష్యత్తులో పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయం చేస్తామన్నారు. అనంతరం మార్కుల పరంగా ప్రథమస్థానంలో నిలిచిన బారగజ్జి మొబీనాకు రూ. 5 వేలు, ద్వితీయస్థానం సాధి ంచిన బసిరెడ్డి తేజశ్రీకి రూ. 4 వేలు, తృతీయస్థానం సాధించిన పెయ్యల భార్గవికి రూ. 3 వేలు నగదు ప్రోత్సాహకాలతో పాటు, మొమెంటో ,ప్రశం సాపత్రాలను అందజేశారు. మూడవ తరగతి విద్యార్థులందరికీ పలకలు పంపిణీ చేశారు. శింగరాయపల్లె ప్రాథమికపాఠశాల ఉపాధ్యా యురాలు బి.వనజమ్మ నాలుగవతరగతి విద్యార్థులకు పలకలు పంపిణీచేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు పి.జె.పి.కవిత, మండల నాయకులు ఎ.గురివిరెడ్డి, బి.నారాయణ, మార్కెట్ యార్డు డైరెక్టరు శింగరయ్య, గ్రామస్తులు, తల్లితండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సలావుద్దీన్‌కు పిసిసి ఉపాధ్యక్ష పదవి ఇవ్వాలి

**ప్రజాశక్తి - కడప అర్బన్ :** కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్న సంఘసేవకులు సయ్యద్ సలావుద్దీన్‌కు అధిష్టానం పిసిసి ఉపాధ్యక్ష పదవి ఇచ్చి సముచిత స్థానం కల్పించాలని అభిమానులు కోరుతున్నారు. కడప అసెంబ్లీ స్థానానికి బరిలో ఉండి అధిష్టానం ఆదేశాల మేరకు తప్పుకుని కడప ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం ఎంతో కృషి చేశారు. కడప సెగ్మెంట్‌లో ఎంపీకి, ఎమ్మెల్యేకు గౌరవప్రథమైన ఓట్లు లభించాయంటే అందుకు సలావుద్దీన్ సేవలే అని చెప్పడం అతిశయోక్తి కాదని పేర్కొన్నారు. అధిష్టానం ఆదేశాలను ఎంతో వినయ విధేయలతో శిరసావహించే సయ్యద్ సలావుద్దీన్ తన స్వంత నిధులతో కరపత్రాలు, వాహన ప్రచారం నిర్వహించి కడప ప్రజల హృదయంలో కాంగ్రెస్ పార్టీ పట్ల సానుభూతి పెరిగేలా చేశారని తెలిపారు. ఆయన సేవలను గుర్తించి రాష్ట్ర అధ్యక్షులు వైఎస్ షర్మిల రాష్ట్ర ఉపాధ్యక్ష పదవితో సత్కరించాలని కడప ప్రజలు, పార్టీ అభిమానులు కోరుతున్నారు.

## ఎస్‌బిఐలో తారకనాథ్ వర్ధంతి

**ప్రజాశక్తి - కడప అర్బన్**

ఎస్‌బిఐ స్టాఫ్ యూనియన్ జనరల్ సెక్రటరీ వై. తారకనాథ్ వర్ధంతిని ఎస్‌బిఐ సెవెన్ రోడ్స్ బ్రాంచ్‌లో శనివారం నిర్వహించారు. 20 సంవత్సరాలుగా ఎన్నో స్వచ్ఛందలు సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తు న్నాయన్నారు. పేదలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేయడంతో పాటు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 7 రోడ్స్ బ్రాంచిలో ప్రభుత్వ సర్వజన వైద్యశాల, కడప సిబ్బంది సహకారంతో రక్తదాన శిబిరం నిర్వహించారు. స్టేట్ బ్యాంక్ ప్రాంతీయ నిర్వహణ అధికారి కిషోర్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ తారకనాథ్ చేసిన నిస్వార్థ సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఎస్‌బిఐ సిబ్బంది, యూనియన్ ప్రాంతీయ కార్యదర్శి పి.సంజీవ ఆనంద్ కుమార్, కడప ఎస్.బి.ఐ ప్రధాన శాఖ స్థానిక కార్యదర్శి బి.సంధ్యారాణి, వివిధ శాఖల కార్యదర్శులు, సభ్యులు పాల్గొన్నారు.

## దోపిడీ

ప్రజాదృష్టి

ఉమ్మడి జిల్లాలో అక్రమార్కుల ఇష్టారాజ్యం కొనసాగుతోంది. ఇసుక, మట్టి, ఎర్రచందనం వంటి ప్రకృతివనరుల దోపిడీకి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది. ఎవరు అధికారంలో ఉన్నా, తమ దోపిడీకి అడ్డెవరనే ధీమాతో మాఫియా యథేచ్ఛగా సాగిపోతోంది. ఆదినిమ్మాయపల్లి బ్యారేజ్ సమీపంలో ఇసుక అక్రమ రవాణాపై ఆర్‌డిఒ విచారణకు ఆదేశించిన సంగతి తెలిసిందే. మైదుకూరు నియోజకవర్గం మల్లేపల్లి, అన్నమయ్య జిల్లా రాజంపేట నియోజకవర్గ కేంద్రం సమీపంలోని ఊటుకూరు సమీప ప్రాంతాల నుంచి యథేచ్ఛగా సాగుతున్న మట్టి అక్రమ రవాణాను ఊటుకూరు గ్రామస్తులు అడ్డుకున్న వైనం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. గ్రామీణులు తిరగబడే వరకు సంబంధిత రెవెన్యూ, పోలీస్ అధికా రులు ఏమి చేస్తున్నారనే విమర్శ పెద్దఎత్తున వినిపిస్తోంది. 2024 సార్వత్రిక ఎన్నికల అనంతరం రాష్ట్రంలో అధికారం చేతులు మారిన నేపథ్యంలో అధికారులు ముందుకెళ్తే ఏమవుతుందో, వెనక్కి వెళ్తే ఏమవుతుందోననే ఉద్దేశంతో పోలీస్, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లు వెత్తుతున్నాయి. ఉమ్మడి జిల్లాలకు చెందిన జిల్లా స్థాయి అధికారులు అధికా రులను కలిసి బొకేలు ఇవ్వడానికి పరిమితం కావడం ఆందోళనకరం. తమ శాఖల పరిధిలో ఏమి జరుగుతోందనే ఆలోచన లేకపోవడం సరికాదని గ్రహించాలి. త్వరలో ఉమ్మడి జిల్లాలకు చెందిన ఉన్నతాధి కారుల బదిలీలు ఉన్న నేపథ్యంలో అధికారులు చేష్టలుడిగి చూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. విధి నిర్వహణలో ముక్కుసూటిగా వెళ్తే ఎక్కడ ఎటువంటి ఇబ్బందులు వస్తాయోనని ఉద్దేశమూ కావచ్చు. ఇందుకు అనుగుణంగానే కడప జిల్లాలో పలువురు పోలీస్ అధికా రుల బదిలీలు చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ఇటువంటి నిర్లక్ష్యపు జాడ్యంతో ఇసుకాసురులు, మట్టి మాఫియాలు యథేచ్ఛగా దోపిడీకి లాకులెత్తడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలోని అధికార పార్టీకి చెందిన కీలక నాయకులు అక్రమార్కులతో చేతులు కలిపి అక్రమాలను సక్రమం చేసే పనిలో నిమగ్నం కావడం దొందూదొందే అనే అభిప్రాయాన్ని కలిగిస్తుండడం గమనార్హం. వైసిపికి చెందిన నాయకులను విమర్శించిన టిడిపి నాయకులు ఇప్పుడు వారితోనే అంటకాగడంలోని ఆంతర్యమేమిటో వెల్లడించాలి. సార్వత్రిక ఎన్నికల్లో గెలిచిన ఎమ్మెల్యే 13 మంది అభ్యర్థులు అసెంబ్లీకి వెళ్లి ప్రమాణ స్వీకారం చేయడంలో చూపిన చొరవ కాదు, జిల్లాలోని అక్రమాల తంతును అరికట్టడంలో చూపించాల్సిన అవసరం ఉందని గ్రహించాలి. అప్పుడే గెలిపించిన ప్రజలకు సేవ చేసినట్లు అవుతుంది. ఇసుక, మట్టి మాఫియా వంటి ప్రజావ్యతిరేకులను కట్టడి చేయాల్సిన నాయకత్వం, అక్రమార్కులకు వంతపాడితే ప్రజలఆదరణను వేగంగా కోల్పోతారనే సంగతిని మరువరాదు. 2009 నుంచి 2019 వరకు సుమారు పదేళ్లుగా కడప జిల్లాలో ఒక సీటుకే అధికార టిడిపి పరిమితమైన సంగతి తెలిసిందే. 2024 సార్వత్రిక ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలోని 10 అసెంబ్లీ స్థానాల్లో టిడిపి ఏడు స్థానాలను, బిజెపి, జనసేన ఒకటి చొప్పున గెలుచుకున్నాయి. వైసిపి తరహా కబ్జాలకు, అక్రమ రవాణాకు లాకులెత్తితే ఇంతకంటే దారుణ పరాజయాన్ని మూటగట్టుకోవాల్సి వస్తుందనే సత్యాన్ని గ్రహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని చెప్పవచ్చు.

**- ప్రజాశక్తి - కడప ప్రతినిధి**



పైపుల గన్ పనితనాన్ని ప్రదర్శిస్తున్న అమ్మకందారుడు

## రైతులకు ఉపయోగపడే శబ్దపు గన్

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

రైతులు, ప్రజలకు ఉపయోగపడే తరహాలో పైపులతో తయారు చేసిన శబ్దపు గన్‌కు విపరీతమైన క్రేజ్ వచ్చింది. వీటిని ఓ వ్యక్తి పులివెందుల బిఎస్ఎన్ఎల్ సమీపాన శనివారం అమ్మకాలు చేశారు. ఒక్కదాన్ని ధర రూ.250తో ప్రజలు కొనుక్కున్నారు. ఒకప్పుడు తోటల వద్ద, పందుల బెడద, పక్షుల బెడద, జంతువుల బెడద నుండి పంట పొలాలను కాపాడుకునేందుకు డబ్బాలో రాళ్లు వేసి శబ్దం చేసేవారు. కాలక్రమేణా అవి పోయి ఎయిర్‌గన్‌లు వచ్చాయి. వీటితో శబ్దం చేసి పారదోలేవారు. అయితే వాటికి కూడా పక్షులు, జంతువులు భయపడడంలేదు. ఈ నేపథ్యంలో పలువురు రైతులు పైపులతో శబ్దం వచ్చే గన్ తయారు చేశారు. నిమ్మ, మామిడి, మాగబెట్టే కార్బైట్ ముక్కలను ఆ పైపులో వేసి పైపు కింద ఏర్పాటు చేసిన లాస్ట్ లైటర్ ఒత్తితే భయంకరమైన శబ్దం వస్తుంది. దీంతో రైతులు, ప్రజలు వాటిని కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. పైపుల నుండి వచ్చే శబ్దానికి అడవి జంతువులు, పక్షులు పారిపోతాయని నమ్మకంతో రైతులు కొనుగోలు చేస్తున్నారు. పట్టణ ప్రజలు కోతుల బెడద నుంచి తప్పించుకునేందుకు కూడా పైప్‌ల గన్‌ను కొనుగోలు చేస్తున్నారు.

## నేడు సాంస్కృతిక కార్యక్రమాలు

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**

వారాంతపు సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా ఆదివారం సాయంత్రం 5.40 గంటల నుంచి రాత్రి 8.00 గంటల వరకు డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంట్‌లో పలు కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు శిల్పారామం పరిపాలన అధికారి సుధాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ వైఎస్ఆర్ ఉలిమెల్ల లేక్ ఫ్రంటలో శ్రీ యువ కిషోర్, యువరాజా డ్యాన్సింగ్ స్కూల్, పులివెందుల వారి చిన్నారులచే కోలాటం, జానపద, వెస్టర్న్ మొదలగు నృత్య ప్రదర్శనలు ఉంటాయన్నారు. పులివెందుల పట్టణ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని సదరు కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆయన కోరారు.



పలకలు, స్వీట్స్ అందజేస్తున్న గంగయ్య, పీటర్

## విద్యార్థులకు పలకలు, స్వీట్స్ పంపిణీ

**ప్రజాశక్తి - బ్రహ్మంగారిమఠం**

మండలంలోని సోమిరెడ్డిపల్లె గ్రామపంచాయతీ పరిధిలోని నరసన్నపల్లె ఎస్సీ కాలనీ అంగన్వాడీ కేంద్రంలోని విద్యార్థులకు టిడిపి మండల అధ్యక్షులు చెన్నుపల్లి సుబ్బారెడ్డి, సీనియర్ నాయకులు ఎల్లటూరు సాంబ శివారెడ్డి సహకారంతో టిడిపి నాయకులు శనివారం పలకలు, బలపాలు, బిస్కెట్, స్వీట్స్ పంపిణీ చేశారు. టిడిపి నాయకులు నాగిపోగు గంగయ్య, జగన్, పీటర్ అంగన్వాడీ సూపర్వైజర్ శారద సమక్షంలో విద్యార్థులకు పంపిణీ చేశారు. పాఠశాల ఆవరణలో కాంపౌండ్ లేకపోవడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారని, మరుగుదొడ్లు పాడయ్యాయని, మరమ్మతులు చేయించాలని, సిబ్బంది కొరత వంటి సమస్యలను సూపర్‌వైజర్ శారద, టీచర్ పెద్ద ఓబులమ్మ నాయకుల దృష్టికి తీసుకెళ్లారు. సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి త్వరలోనే పరిష్కారమయ్యేలా కృషి చేస్తామన్నారు.

## ఈపురుపాళెం దుర్ఘటన అమానుషం

**- పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి**

**ప్రజాశక్తి - వేంపల్లె**

బాపట్ల జిల్లా చీరాల మండలంలోని ఈపురుపాళెం పంచాయతీలోని సీతారాంపేటలో సుచరిత అనే యువతిని కొందరు అత్యాచారం చేసి, కర్రలతో కొట్టి రైలు పట్టాల వద్ద పడేయడం అమానుషమని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పేర్కొన్నారు. శనివారం వేంపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేదనడానికి ఈ ఘటన నిదర్శనమన్నారు. రాష్ట్రం డ్రగ్స్, మద్యం, గంజాయి ఆంధ్రప్రదేశ్‌గా మారిందని పేర్కొన్నారు. వీటి మత్తులో యువకులు అసాంఘిక శక్తులుగా తయారైనట్లు ఆవేదన వ్యక్తం చేశారు. హైస్కూల్ విద్యార్థులు కూడా వీటికి అలవాటు పడ్డారని తెలిపారు. డ్రగ్స్, మద్యం, గంజాయిని రాష్ట్ర ప్రభుత్వం అరికట్టాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర హోం మంత్రి సంఘటన స్థలానికి చేరుకొని బాధిత కుటుంబాన్ని పరామర్శించడం అభినందనీయమన్నారు. ఈపురుపాళెం ఘటనకు కారకులైన వారిని చట్టపరంగా కఠినంగా శిక్షించాలని తులసిరెడ్డి కోరారు. ఇలాంటి చర్యలు జరగకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.



ఎడ్ల పందెల పోటీలను ప్రారంభిస్తున్న సర్పంచ్ పెద్దిరెడ్డి

## పుల్లూరులో బండలాగుడు పోటీలు

**ప్రజాశక్తి - ఖాజీపేట**

మండలం పరిధిలోని ఆంజనేయకొట్టాలు పంచాయతీ కొత్త పుల్లూరులో అంకాలమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా ఎడ్లచే బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలను సర్పంచ్ పెద్దిరెడ్డి ప్రారంభించారు. పోటీల్లో గెలుపొందిన ఎడ్ల యజమానులకు బహుమతులను అందజేశారు.

## సమస్యల పరిష్కారానికి అందుబాటులో ఉంటాం

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

పులివెందుల వార్డుల్లోని సమస్యలు పరిష్కారానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటామని మున్సిపల్ ఇన్‌ఛార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం పట్టణంలోని సుజాత హాల్ వెనుక భాగంలో ఉన్న ప్రశాంత్ నగర్ కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రయినేజీ, వీధి దీపాల సమస్యలను వైఎస్ మనోహర్‌రెడ్డి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే వారు అక్కడికి చేరుకుని వాటిని పరిశీలించి సమస్యను పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులకు ఫోన్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో ఏ సమస్య ఉన్నా ఎప్పటిలాగే పరిష్కారానికి ప్రజలకు అందుబాటులో ఉంటామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, జేసియస్ ఇన్‌ఛార్జి పార్నపల్లి కిషోర్, వైసిపి నాయకులు రంగాపురం మధుసూదన్ రెడ్డి, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న మనోహర్‌రెడ్డి

# కనుమరుగవుతున్న మట్టి పాత్రలు

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

ప్రస్తుత తరుణంలో మట్టి పాత్రలు కనుమరుగవుతున్నాయి. ఇవి ఆదరణను కోల్పోవడంతో వీటిపై ఉపాధి పొందుతున్న కార్మికులకు ఇబ్బందులు తప్పడంలేదు. మనిషి దైనందిన జీవితం ప్రారంభించినప్పటి నుంచి ఈ మట్టి పాత్రలు ఎన్నో విధాలా ఉపయోగపడ్డాయి. బానలు, కడవలు, ముంతలు, మూకుళ్లు ఇలా వివిధ రకాల ఆకృతుల్లో మట్టి పాత్రలు తయారు చేస్తారు. పాత్రలు వివిధ రకాలుగా ఉపయోగపడ్డాయి. ఒకప్పుడు వీటిని తయారు చేసిన గ్రామకులు అదే పనిగా ఊరూరి పండుగ ముందు గ్రామాలకు వెళ్లి విక్రయించుకుని జీవనం సాగించేవారు. వీటిని నగదు లేదా ధాన్య రూపంలో మార్పిడి చేసుకునేవారు. సాంకేతిక పరిజ్ఞానంలో మార్పులు చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో మట్టి పాత్రల వినియోగానికి దూరమవుతూ వస్తున్నారు. అలాగే కేరళలో తయారయ్యే వివిధ రకాల వస్తువుల మార్కెట్లోకి రావడంతో మట్టి పాత్రల వినియోగం కొంతవరకు తగ్గిందని చెప్పవచ్చు. మట్టి పాత్రల్లో నింపిన నీటిని తాగడం వల్ల దప్పిక కూడా తగ్గుతుంది. వేసవిలో చలివేంద్రాల్లో మట్టి పాత్ర లనే వినియోగించారు. పూర్వకాలంలో బాట సారుల దాహార్తి తీర్చేందుకు మట్టి బానలను విరివిగా వినియోగించినట్లు తెలుస్తోంది. పలువురు దాతలు చలి వేంద్రాల ఏర్పాటులో మట్టి బానలనే వాడుతున్నారు. యాంత్రికంగా తయారు చేసిన వాట కంటే మట్టి పాత్రలే శ్రేయస్కరమని పలువురు సూచిస్తున్నారు. వేసవి రాగానే మట్టి పాత్రలు గుర్తొస్తాయి. ప్రస్తుతం అక్కడక్కడ కుండల వ్యాపారం దర్శనమిస్తోంది. నిత్యావసరాల తరహాలోనే వీటి ధరలు కూడా పెరిగాయి. ప్రస్తుతం మట్టి పాత్రలను ఇతర ప్రాంతాల నుంచి తీసుకొచ్చి క్రయవిక్రయాలు సాగిస్తున్నారు. రవాణా ఛార్జీలు విపరీతంగా పెరగడం వల్ల తాము కూడా ఈ పాత్రలకు ధరలు పెంచాల్సి వస్తోందని వ్యాపారులు చెబుతున్నారు. ఏది ఏమైనా దశాబ్దాల కాలంపాటు ఉపయోగపడిన మట్టి పాత్రలు నేడు కాలగమనములో కనుమరుగయ్యాయని చెప్పవచ్చు.



తయారుచేస్తున్న శ్రామికుడు



మట్టి పాత్రలు

# క్రమమైన జీవనశైలితో గుండె సమస్యలు దూరం

## ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వెంకట చెంచయ్య




ధృతి ఆస్పత్రి

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

సక్రమమైన జీవనశైలి, పౌష్టికాహారంతో గుండె సంబంధిత సమస్యలు దూరం అవుతాయని ప్రముఖ ఇంటర్‌వెన్షనల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ వెంకట చెంచయ్య పేర్కొన్నారు. ముప్ఫై నలభై ఏళ్ల క్రితం ఎప్పుడో ఒకసారి గుండెపోటు అని వినేవాళ్లం. కాని మహమ్మారి కోవిడ్ అనంతరం ఈ వ్యాధి గురించి తరచుగా వింటున్నాం. కోవిడ్-19 తర్వాత గుండె జబ్బుల సంఖ్య బాగా పెరిగిందన్నారు. 2022లో గుండెపోటు కేసులు 12.5శాతం పెరిగినట్లు గణాంక వివరాలు చెబుతున్నాయి. ఆశ్చర్యకరమైన విషయం ఏంటంటే ఈ మధ్యకాలంలో చిన్నపిల్లలతోపాటు యుక్తవయసు వాళ్లలో కూడా ఈ గుండెపోటు మరణాలు వింటుంటే ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రొద్దుటూరుకు చెందిన గుండె, ప్రసూతి శస్త్ర చికిత్సల ధృతి ఆస్పత్రి అధినేత డాక్టర్ వెంకటచెంచయ్య శనివారం 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. రక్తనాళాల్లో క్లాట్ అయినప్పుడు గుండె కండరాల వరకు రక్తం సరఫరాలో ఆటంకం ఏర్పడడంతో గుండెపోటు వస్తుందన్నారు. గుండెల్లో తీవ్రమైన నొప్పి రావడం గుండెపోటు లక్షణమన్నారు. గుండెపోటు వచ్చిన వ్యక్తికి కార్డియాక్ అరెస్ట్ వచ్చే ప్రమాదం ఉంది. కార్డియాక్ అరెస్ట్ జరిగినప్పుడు గుండె తక్షణమే రక్తప్రసరణం నిలిపివేస్తుందని అన్నారు. గుండెలోపల ఉండే ఏదైన ఇన్‌ఫెక్షన్ వల్ల కార్డియాక్ అరెస్ట్ జరగవచ్చన్నారు. గుండెపోటు వచ్చినప్పుడు చికిత్స అందించడంలో ఎంత ఆలస్యమైతే గుండెకు శరీరానికి అంత నష్టం జరుగుతుందన్నారు. కొద్దిదూరం నడిచినప్పుడు, పని చేసినప్పుడు, కళ్లు తిరినట్లు అనిపించడం ఆయాశం రావడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది అనిపించడం కార్డియాక్ అరెస్ట్ లక్షణాలుగా డాక్టర్ వివరించారు. గుండెపోటుకు గురైన వ్యక్తికి కార్డియోపల్మనరీ రిససిటేషన్ (సిపిఆర్) చేయడం ద్వారా గుండెను మళ్లీ స్పందించేలా చేయవచ్చన్నారు. స్పృహ తప్పి పడిపోయిన 3-4 నిమిషాల్లో గుండెమీద చేతులతో లయబద్ధంగా వెంటవెంటనే తగినంత ఒత్తిడితో నొక్కాలన్నారు. గుండె కండరాలన్నింటినీ ఉత్తేజితం చేసి అవసరమైన రక్తం మళ్లీ అందేలా చేయవచ్చన్నారు. 40ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరూ బి.పి., షుగర్ వంటి పరీక్షలతోపాటు గుండె సంబంధిత పరీక్షలు చేయించుకోవాలన్నారు. కఠిన వ్యాయం



డాక్టర్ వెంకట చెంచయ్య

చేసేవారు గుండె రక్తనాళపు గోడల్లో చీలికలు ఏర్పడే అవకాశం ఉండి గుండెపోటు ప్రమాదానికి దారి తీయవచ్చన్నారు. గుండెపోటు కారణంగా చాలా మందికి నొప్పి ఛాతీలో ఇబ్బందిగా ఉంటుందని, ఎడమభుజంలో నొప్పి ఉంటుందన్నారు. శరీరం అలసిపోవడం, వాంతులు, అరగంట ముందు శరీరం అంతా చెమటలు పట్టడం గుండె పోటు లక్షణాలుగా తెలిపారు. గుండెపోటుకు జన్యుపరమైన కారణాలతోపాటు మారుతున్న జీవనశైలి, వత్తిడి, మద్యపానం, ధూమపానం, నియంత్రణలోలేని బి.పి., షుగర్, అధిక మాంసాహారం, నూనె పదార్థాల వినియోగం, కఠిన వ్యాయామం, శ్రమ, ఊబ కాయం కారణాలుగా ఆయన వివరించారు. పైన చెప్పినట్లు జీవనశైలి, పౌష్టికర ఆహారంతోపాటు క్రమం తప్పని తేలికపాటి వ్యాయామం, రోజులో ఏడెనిమిది గంటల పాటు సుఖ నిద్ర, నాలుగు పదుల వయసు దాటిన అనంతరం ఏడాదికొకసారి గుండె సంబంధిత పరీక్షలు చేయించుకుంటూండాలని ఆయన సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. గుండె జబ్బులు దారంగా ఉంటాయని డాక్టర్ వెంకట చెంచయ్య తెలిపారు.

# అతిసారపై జాగ్రత్తలు అవసరం : కమిషనర్



సిబ్బందికి సూచనలిస్తున్న మున్సిపల్ కమిషనర్

**ప్రజాశక్తి - మైదుకూరు**

ముందస్తు జాగ్రత్తలతో అతిసారను నియంత్రించవచ్చునని మైదుకూరు మున్సిపల్ కమిషనర్ జబ్బర్ మియా తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం ఆయన మున్సిపల్ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో అతిసార వ్యాధిపై సమీక్షించారు. ఈ సందర్భంగా జబ్బర్‌మియా మాట్లాడుతూ నీరు నిల్వ ఉన్నచోట జాగ్రత్తలు తీసుకోవాలన్నారు మురుగునీటిలో, గుంతలలో కొంచం కిరోసిన్ లేదా పెట్రోల్ వేయడంతో దోమల గుడ్లు వ్యాప్తి చెందవని పేర్కొన్నారు. నీటి నిలువ ఉన్నచోట స్ప్రే చేయాలన్నారు. హోటల్స్, రెస్టారెంట్లలో పరిశుభ్రత ఉండాలని, లేకపోతే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజలకు అతిసార వ్యాధిపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ కిరీటీ, మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ శానిటరీ సెక్రటరీలు, అమేంటీస్, ఎఎన్ఎంలు, మెప్మా సిబ్బంది హాజరయ్యారు.

**జమ్మలమడుగు రూరల్ :** జమ్మలమడుగు నగర పంచాయతీలో తాగునీరుపై ప్రత్యేకశ్రద్ద తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. స్థానిక మున్సిపల్ సభా ప్రాంగణంలో శనివారం డయేరియా ప్రబలకుండా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తాగునీరు కలుషితం కాకుండా చూడాలన్నారు. ప్రజలకు డయేరియాపై అవగాహన కల్పించాలన్నారు. ఇండ్ల ముందు శుభ్రత పాటించేలా అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో డిఇ బాల మల్లేశ్వర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, కార్యదర్శులు పాల్గొన్నారు.

**పులివెందుల రూరల్ :** పులివెందుల పురపాలక పరిధిలో డయేరియా వ్యాధి ప్రబలకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి అధికారులకు సూచించారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో కలెక్టర్ ఆదేశాల మేరకు వార్డు, సచివాలయ ఉద్యోగులతో ఆయన సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు, హాస్పిటల్స్ పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. పైప్‌లైన్లు, కుళాయిల వద్ద మురుగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలన్నారు. అయిదేళ్లలోపు పిల్లలకు సరైన పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఐసిడిఎస్, మెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి

## యువ రచయితలకు చక్కని అవకాశం

**ప్రజాశక్తి - ప్రొద్దుటూరు**

విజయవాడలో డిశంబర్ నెలలో జరిగే జాతీయ తెలుగు యువ రచయితల సమ్మేళనానికి 40 ఏళ్లలోపు యువతకు చక్కటి అవకాశం కల్పిస్తున్నట్లు కడప జిల్లా రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి జింకా సుబ్రహ్మణ్యం శనివారం సాయంత్రం ఒక ప్రకటనలో తెలిపారు. కృష్ణా జిల్లా రచయితల సంఘం సహకారంతో ప్రపంచ తెలుగు రచయితల సంఘం ఆధ్వర్యంలో డిశంబర్ 28, 29తేదీల్లో జరుగబోవు 'జాతీయ తెలుగు యువ రచయితల సమావేశాల్లో' రెండు రోజులు శిక్షణ శిబిరంలో పాల్గొనేందుకు అవకాశం కల్పిస్తున్నారన్నారు. శిక్షణ శిబిరంలో పద్యరచన, వచన కవిత, నవల, గేయం, నాటకం, వ్యాసరచన మొదలగు ప్రక్రియల్లో ప్రసిద్ధ రచయితలతో శిక్షణ ఇప్పించడమే కాకుండా కవి సమ్మేళనాలలో పాల్గొని ప్రశంసాపత్రం జ్ఞాపిక, సత్కారం ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని సాహిత్య అభిలాషగల యువత వినియోగించుకోవాలని కోరారు. మిగిలిన విషయాలకు జి.వి. పూర్ణచంద్, ప్రధాన కార్యదర్శి 9440172642ను సంప్రదించాలని కోరారు.

## కార్పొరేట్ పాఠశాలలపై నిఘా ఉంచాలి

**ప్రొద్దుటూరు :** కార్పొరేట్ పాఠశాలలు విద్యద్వారా పిల్లలను అడ్డుపెట్టుకొని తల్లిదండ్రుల నుంచి అడ్డంగా దోచుకుంటున్నాయని, ఇలాంటి వాటిపై నిఘా పెట్టాలని ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ ఓబులేసు కోరారు. ఆ మేరకు కడప డిఇఒ కార్యాలయంలో శనివారం ప్రాంతీయ సంయుక్త విద్యాశాఖాధికారి (ఆర్‌జెడి) రాఘవరెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలసీమ వ్యాప్తంగా ఉన్న భాష్యం పాఠశాలల్లో వేలాది రూపాలయతో పాఠశాల ఆవరణలోనే ప్రత్యేక గదులను కేటాయించి అందులో తమ పాఠశాల పుస్తకాలను తరగతిని బట్టి రూ.3వేల నుండి రూ.10వేల వరకు వసూలు చేస్తూ దోచుకుంటున్నాయని ఆరోపించారు. కడప పట్టణంలో ఎలాంటి కనీస సదుపాయాలు లేకుండ భాష్యం విద్యాసంస్థలు నడుపుతున్నారన్నారు. విద్యాశాఖాధికారులకు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం శోచీయమన్నారు. గత మూడురోజుల క్రితం ప్రొద్దుటూరు పట్టణంలో ఎంఇఒ సావిత్రమ్మ ఆధ్వర్యంలో సీజ్ చేసిన పాఠశాల పుస్తకాలను మళ్లీ వారికివ్వడం శోచనీయమన్నారు. అధికారులు చేతివాటాన్ని ప్రదర్శిస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## వైఎస్ఆర్ విగ్రహాన్ని తొలగించొద్దు

**ప్రజాశక్తి - చాపాడు**

యోగి వేమన విశ్వవిద్యాలయం ప్రాంగణం నుంచి మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్‌రెడ్డి విగ్రహాన్ని తొలగించాలిని కొందరు టిఎన్ఎస్ఎఫ్ నాయకులు వైస్ ఛాన్సెలర్‌కు వినతిపత్రం అందించడం శోచనీయమని వైస్సార్సీపీ విద్యార్థి విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి రాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రాజశేఖర్ రెడ్డి విగ్రహానికి పాలాభిషేకం చేసి ప్రస్తుతం తొలగించాలను కోవడం దారుణమన్నారు. రాజకీయంలో గెలుపు ఓటములు సహజమన్నారు. కక్ష సాధింపు రాజకీయాలు మానుకోవాలని కోరారు. వైస్సార్ యోగివేమన విశ్వవిద్యాలయం వ్యవస్థపకుడని, దాదాపు 16 ఏళ్ల నుంచి ఆయన విగ్రహాన్ని ప్రతిష్టించి ఉందన్నారు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్షిప్ వంటి పథకాల ద్వారా విద్యా రంగానికి ఆయన చేసిన సేవలు చిరస్థాయిలో మిగిలిపోతాయన్నారు.

## గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టండి..!

**చక్రాయపేట :** మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య పనులు చేపట్టాలని ఎంపిడిఒ సోమశేఖర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపిడిఒ ఆధ్వర్యంలో తహశీల్దార్, వైద్యాధికారులు, మండల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, వెలుగు ఎంపిఒతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ప్రతి సోమవారం ఉదయం 9,30గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక నిర్వహిస్తామన్నారు. గ్రామాల్లో శానిటేషన్ కార్యక్రమాన్ని జాగ్రత్తగా ఏర్పాటు చేయాలని కోరారు. పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ బండి రాజు, వైద్యాధికారి వాణి, పంచాయతీ సెక్రెటరీ పాల్గొన్నారు.

## బిల్లులు ఇవ్వాలని నిలదీయండి

**- టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బిటెక్ రవి**

**ప్రజాశక్తి - పులివెందుల టౌన్**



పాడా నిధుల ద్వారా గత ప్రభుత్వంలో పనులు చేసి పెండింగ్‌లో ఉన్న బిల్లులను ఇవ్వాలని పులివెందుల వచ్చిన మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని నిలదీయాలని వైసిపి నాయకులకు టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి మారెడ్డి రవీంద్రనాథ్‌రెడ్డి (బిటెక్ రవి) సూచించారు. విజయవాడ కేంద్రం నుంచి శనివారం ఆయన ఒక వీడియోను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల అభివృద్ధికి పాడా నిధుల ద్వారా కొన్ని పనులు చేపట్టారని, ఇందులో దాదాపు రూ.700 కోట్ల దాకా బిల్లులు చెల్లించలేదన్నారు. మన ప్రభుత్వం రాకపోతే ఇబ్బంది పెడతారని తమ బిల్లులు ఇప్పించమని జగన్మోహన్ రెడ్డి, ఎంపీ అవినాష్‌రెడ్డిలకు నాయకులు మొరపెట్టుకున్నా మాయ మాటలు చెప్పి పబ్బం గడుపుతూ బిల్లులు చేయకుండా మొండిచేయి చూపారని తెలిపారు. కొంతకాలం నాలుగు రోజుల ముందు పులివెందుల మెడికల్ కళాశాలకు రూ.100 కోట్లు, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సంస్థలకు వేల కోట్ల బిల్లులు విడుదల చేశారన్నారు. పులివెందుల నాయకులకు బిల్లులు చేస్తే ఏమీ రాదు.. అదే రామచంద్రారెడ్డి వారికి చేస్తే పది శాతం కమీషన్ వస్తుందని జగన్ బిల్లులు చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా పులివెందుల నాయకులు వాస్తవాలు గ్రహించి పులివెందులకు వచ్చినటువంటి మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని మా పరిస్థితి ఏంటని నిలదీయాలని బిటెక్ రవి వైసిపి నాయకులకు సూచించారు. తమ మీద కక్ష సాధింపు చేసినట్లు తాము చేయబోమని.. ఎందుకంటే పులివెందుల నాయకులు కూడా మా ప్రాంత వాసులనని.. అందుకే ముఖ్యమంత్రి చంద్రబాబుకు పాడాలో జరిగిన పనుల బిల్లులను మంజూరు చేయమని సిఫారసు చేస్తామన్నారు. పులివెందుల ప్రజలకు జగన్మోహన్ రెడ్డి మీద అభిమానం ఉంది కానీ.. వారి మీద ఆయనకు అభిమానం లేదన్నారు. కేవలం తన సొంత అక్రమార్జనకే ప్రాముఖ్యత నిస్తున్నారని, ఈ విషయాన్ని ప్రజలు గ్రహించాలని రవి కోరారు.

## స్పీకర్ ఎన్నికను బహిష్కరించడం తగదు

**ప్రజాశక్తి - చాపాడు**

గతంలో ఎన్నడూ లేని విధంగా అసెంబ్లీ స్పీకర్ ఎన్నిక రోజున అక్కడికి వెళ్లకుండా వెనుతిరగడం వైసిపి నాయకులకు తగదని టిడిపి జిల్లా ప్రచార కార్యదర్శి మునిశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో 23 సీట్లు వచ్చాయని టిడిపిని హేళన చేసినా అసెంబ్లీకి తప్పకుండా హాజరవుతూ వచ్చారన్నారు. ప్రస్తుతం 11 సీట్లకే పరిమితమైన జగన్ ముఖం చాటేయడం తగదన్నారు. ఆంధ్రప్రదేశ్ చరిత్రలో ఇంతవరకు స్పీకర్ ఎన్నికను ఏ పార్టీ బహిష్కరించలేదన్నారు. రాబోయే రోజుల్లో ప్రజా సమస్యలపై పోరాడడానికి అసెంబ్లీకి పోవాలంటే జగన్‌కు చాలా నామోసిగా ఉన్నట్లు ఉందన్నారు. ఇలాంటి వ్యక్తి 2029 ఎలక్షన్లలో మళ్లీ వైసిపి ప్రభుత్వం వస్తుందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రతిపక్ష హోదా లేకపోయినా మంత్రుల తర్వాత జగన్ ప్రమాణ స్వీకారం చేసేలా అవకాశం కల్పించినా, తన సొంత పేపర్‌లో పిచ్చి రాతలు రాశారని గుర్తు చేశారు.



## టెట్ నిర్వహించాలని మంత్రి లోకేష్‌కు వినతి

**ప్రజాశక్తి - పులివెందుల రూరల్**

విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను విజయవాడలో శనివారం శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డి కలిశారు. ఎన్డీఏ కూటమి ఎన్నికలకు ముందు వాగ్దానం చేసిన విధంగా ఆంధ్రప్రదేశ్‌లో 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి సంబంధించి ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేశారని తెలిపారు. ఇది ముఖ్యమంత్రి తీసుకున్న వేగవంతమైన చర్య అని ఈ నోటిఫికేషన్ మన రాష్ట్రంలోని నిరుద్యోగ ఉపాధ్యాయులకు ఎనలేని సంతోషాన్ని, ఉపశమనాన్ని కలిగించిందన్నారు. ఈ సంవత్సరం చాలా మంది విద్యార్థులు బిఇడి, డిఇడి కోర్సులను ఇటీవల పూర్తి చేసిన వాస్తవాన్ని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. తాజాగా అర్హత సాధించిన ఈ అభ్యర్థులు రాబోయే ఉపాధ్యాయ నియామకాల కోసం దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం ఇవ్వాలన్నారు. వీలైనంత త్వరగా ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)ను నిర్వహించాలని విద్యాశాఖ మంత్రికి వినతిపత్రమిచ్చారు. కంచర్ల శ్రీకాంత్, చిరంజీవి, ఎమ్మెల్సీ సత్యనారాయణ రాజు ఉన్నారు.



## డిప్యూటీ సిఎంను కలిసిన ఎమ్మెల్యే 'ఆది', భూపేష్‌రెడ్డి

**ప్రజాశక్తి - ఎర్రగుంట్ల/ జమ్మలమడుగు రూరల్**

ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి పవన్ కళ్యాణ్‌ను జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి, టిడిపి ఇన్‌ఛార్జి భూపేష్‌రెడ్డి అమరావతిలోని ఉప ముఖ్యమంత్రి కార్యాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నియోజకవర్గంలోని పలు సమస్యలను పవన్‌కల్యాణ్‌కు వివరించారు. నియోజకవర్గ అభివృద్ధిపై చర్చించారు. భూపేష్‌రెడ్డిని ఆప్యాయంగా పలకరించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ శివనాథరెడ్డి ఉన్నారు.

## నీటి కుంటల్లో గంబూసియా చేప పిల్లలు విడుదల

**పులివెందుల రూరల్ :** పులివెందుల అర్బన్ పరిధిలోని విజయ హోమ్స్ సమీపంలోని నీటి కుంటలో, చిన్నకూడాల గ్రామ సమీపంలోనీటి కుంటలో, బలపనూరు గ్రామ శివాలయం దగ్గర చెరువులో, అంకాలమ్మ గూడూరు చెరువులో దోమల నియంత్రణ నిమిత్తం గంబూసియా చేప పిల్లలను విడుదల చేసినట్లు అధికారి సిద్దయ్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లడుతూ జిల్లా మలేరియా అధికారి మనోరమ ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాని చేపట్టామన్నారు. వర్షాకాలంలో సహజంగానే దోమలు విజృంభిస్తాయన్నారు. దోమల సంఖ్యను నియంత్రించేందుకు, వాటిని నాశనం చేసేందుకు చెరువులు, చిన్న చిన్న కుంటల్లో, నీరు నిల్వ ఉండే ప్రాంతాల్లో గంబూసియా చేపలను వదులుతారని తెలిపారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు భాస్కర్, రమణయ్య, గంగా, సుచరిత యంఎల్‌హెచ్‌పి శిరీష, ఆశా కార్యకర్తలు శివ కామేశ్వరీ, సుధేష్ణ, అశ్వత్థామ పాల్గొన్నారు.